సాక్షి
కాకినాడ
శుక్రవారం । 20 । సెప్టెంబర్ । 2024



గొంతు తడారి.. ఇదో ఎడారి


ఆటలాడి... అలసి సొలసిన క్రీడాకారులకు గుక్కెడు నీరు దొరకడం గగనమైంది. గొంతు తడారి దిక్కులు చూస్తున్నా అక్కడ ఎడారినే తలపిస్తోంది. - 8లో



అది పులి కాదు.. అడవి పిల్లి

దివాన్‌చెరువు శివారు శ్రీరామపురం, రాకీ ఎవెన్యూ అపార్ట్‌మెంట్ సమీపంలోని తోటల్లోకి బుధవారం రాత్రి చిరుతపులి దూకిందనే ప్రచారంలో నిజం లేదని అధికారి ఎస్.భరణి తెలిపారు. 8లో

2.01 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం 2,01,882 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 14,200 క్యూసెక్కుల నీరు వదిలారు.

న్యూస్‌రీల్

నిరుద్యోగ భృతికి దరఖాస్తుల ఆహ్వానం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లాలో వేద విద్య అభ్యసిస్తున్న వారు నిరుద్యోగ భృతి కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దేవదాయ శాఖ అధికారి టి.సుబ్రహ్మణ్యం గురువారం విలేకరులకు తెలిపారు. దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వేద విద్యను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న వారు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి పొందేందుకు అర్హులన్నారు. క్రమాంతం ఆపై కోర్సులు చదివిన వేద విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వేద విద్య సర్టిఫికెట్లు, ఆధార్ నకలు, ఏ విధమైన ఉద్యోగం చేయడం లేదని స్వీయ ధృవపత్రంతో ఈ నెల 26 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను జిల్లా దేవాదాయశాఖ కార్యాలయంలో అందించాలన్నారు.

శృంగార వల్లభుని ఆదాయం రూ.19.31 లక్షలు



ఆలయంలో హుండీల సొమ్ము లెక్కిస్తున్న సిబ్బంది

పెద్దాపురం: స్వయంభూ తొలి తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయానికి అన్నదానం, హుండీల ద్వారా 19,31,696 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. గురువారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ బాబు నాయుడు, ఈఓ సీహెచ్ రామ్మోహన రావుల సమక్షంలో హుండీలను తెరిచారు. 79 రోజులకు హుండీల ద్వారా రూ.13,12,116, అన్నదానం హుండీ ద్వారా రూ.6,19,580 వెరసి రూ.19,31,696 ఆదాయం సమకూరిందని ఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, దేవస్థానం అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ బి.మాధురి, ప్రకాష్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్ ఫార్చ్యూన్ సుపోషణ్‌కు శ్రీకారం



ప్రాజెక్టుకు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీడీ ప్రవీణ

కాకినాడ రూరల్: అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఫార్చ్యూన్ సుపోషణ్ కార్యక్రమానికి మండలంలో గురువారం శ్రీకారం చుట్టారు. ఐదేళ్లలోపు చిన్నారుల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని గుర్తించడంతో పాటు, బాలికలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందేలా సీడీపీఎస్‌కు సహకరించేందుకు కాకినాడ రూరల్‌లో పైలట్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. స్థానిక సర్పవరం జంక్షన్ వద్ద స్పందన ఫంక్షన్ హాలులో గురువారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ పీడీ ప్రవీణ హాజరయ్యారు. ముఖ్యఅతిథి అదాని విల్మార్ లిమిటెడ్ కాకినాడ క్లస్టరు హెడ్ మనిష్ బాజ్‌పాయ్, అదాని ఫౌండేషన్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ హెడ్ వివేక్ యాదవ్, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజరు రజీనా సుల్తానా మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ ద్వారా అదానీ ఫౌండేషన్, ఐసీడీఎస్ కలిసి పని చేస్తాయన్నారు. దేశంలో 11 రాష్ట్రాల్లో 17 ప్రదేశాల్లో ఇది అమలవుతుందన్నారు. గ్రామాల్లో పోషకాహార శిబిరాలు, కిచెన్ గార్డెన్లు అభివృద్ధి చేస్తామన్నారు. తమ వలంటీర్లు ప్రతి మూడు అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలో పనిచేస్తారన్నారు. ఈ ప్రాజెక్ట్ నాలుగేళ్ల పాటు అమలులో ఉంటుందన్నారు.



కోతకు గురవుతున్న ఉప్పాడ గ్రామం



తునిలో తాండవ నది

హండ్రెడ్ డేస్ షో!



- బాబు, పవన్ దొందూ దొందే
- గద్దెనెక్కి వంద రోజులైనా ఒక్కదానికీ అతీగతీ లేదు
- ఉప్పాడ తీరం కోత పరిష్కారం పరిశీలనకే పరిమితం
- పిఠాపురం ఆధ్యాత్మికతకు ప్రతిపాదనలే లేవు
- ఒక్క పరిశ్రమా తీసుకు రాకుండా ఉద్యోగాలు ఎలా ఇస్తారో మరి
- ఏలేరు ఆధునీకరణా వట్టిమాటే



కోతకు గురవుతున్న ఉప్పాడ తీరాన్ని పరిశీలించి రక్షణ చర్యలు తీసుకుంటానని హామీ ఇస్తున్న పవన్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అంతన్నారింతన్నారే.. ఇంతా చేసి మొండి చేయి చూపారే అని వంద రోజుల పాలనలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వ్యవహారంపై జనం నిప్పులు చెరుగుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అలవి కాని హామీలను ఎడాపెడా గుప్పించేసి నిలువునా దగా చేశారు. సూపర్ సిక్స్ అని నమ్మించి నట్టేట ముంచేశారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడి హోదాలో చంద్రబాబు, జనసేన అధ్యక్షుడుగా పవన్ కల్యాణ్ హామీలతో ఊరూవాడా ఊదరగొట్టారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో జిల్లాలో పర్యటించిన ప్రతి సందర్భంలోను ఇది చేస్తాం.. అది చేస్తామంటూ నమ్మించి నయవంచనకు పాల్పడ్డారని జిల్లా ప్రజలు మండిపడుతున్నారు. వారి నయవంచన మాటలు నమ్మి ఓటేసిన పాపానికి అప్పుడే వంద రోజులు పూర్తి అయిపోయాయి. ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో స్థానిక అంశాలపై వాగ్దానం చేసిన వాటిలో మచ్చుకు ఒక్కటి కూడా పట్టాలెక్కించిన దాఖలాలు లేవు. కనీసం ప్రతిపాదనలకు కూడా ఇంతవరకు దిక్కూమొక్కూ లేకుండా చేశారని ప్రజలంటున్నారు.

తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చిన వాగ్దానాల్లో ఉప ముఖ్యమంత్రి అయి 100 రోజుల పాలన పూర్తి చేసిన పవన్ కల్యాణ్ ఒక్కటంటే ఒక్క హామీ కూడా అమలుచేయలేక పోయారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల కోసం నియోజకవర్గంలో ఎడాపెడా పవన్ హామీల వర్షం కురిపించారు. అవన్నీ గాలిలో కొట్టుకుపోయాయా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నాడు పిఠాపురం వారాహి సభలో మాట్లాడుతూ పిఠాపురాన్ని ఆధ్యాత్మిక రాజధానిగా తీర్చిదిద్దుతానని ఘనమైన వాగ్దానం ఇచ్చారు. కేంద్ర స్థాయిలో బీజేపీ, ప్రధానితో ఎంతో సాన్నిహిత్యం ఉందని ప్రచారం చేసుకుంటున్న పవన్ ఇప్పటి వరకూ నిధులు ఎందుకు సాధించలేకపోతున్నారని పిఠాపురం ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసిన ఉప్పాడ సముద్ర కోతను నివారించి తీరతానని పవన్ చెప్పుకొచ్చారు. కేంద్ర కోస్టల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాన్ని చెన్నై నుంచి తీసుకు వచ్చి హడావిడి చేయడం తప్ప ఇంతవరకు చిల్లిగవ్వ బడ్జెట్ కేటాయించలేక పోవడాన్ని ఉప్పాడ ప్రజలు నిలదీస్తున్నారు. ఉప్పాడ తీర ప్రాంత పరిరక్షణే కాకుండా సముద్ర తీర ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా కూడా తీర్చిదిద్దుతామని పవన్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నిస్తున్నారు.

ఇటీవల ఏలేరుకు వచ్చిన వరదలతో వేలాది మంది రైతులకు కన్నీటిని మిగిల్చిన ఏలేరు, సుద్ద గడ్డ ఆధునీకరణ కోసం రూ.వెయ్యి కోట్ల ప్యాకేజీ తీసుకువస్తానని పవన్ ఇచ్చిన హామీ గాలిలో దీపమైందంటున్నారు. ఏలేరు కాలువల ఆధునీకరణతో పాటు సుద్దగెడ్డ ముంపునకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని గద్దెనెక్కి నూరు రోజులు పూర్తి అయినా ఆచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. పనిలో పనిగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు పత్తి రైతుల సమస్యలు, పిఠాపురంలో రైల్వే పవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని ఇచ్చిన హామీ కూడా నీటిమీద రాతగా మారింది. ఉప్పాడ కొత్తపల్లి మండలంలో కేఎస్ఈజడ్ రైతుల సమస్యలు పరిష్కరించి పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తామన్నారు. ఇందులో ఇప్పటి వరకు ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేకుండా గాలిమాటలకే పరిమితమయ్యారని ప్రజలు ఆక్షేపిస్తున్నారు.

'కోట'లు దాటిన 'పవన్' మాటలు

ఒక్క పిఠాపురంలోనే కాకుండా సామర్లకోట ఎన్నికల ప్రచార సభలో కూడా పవన్ కళ్యాణ్ మాటలు కోటలు దాటాయి. ఇక్కడ కూటమి తరపున మరో హామీ గుప్పించారు. కాకినాడ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న హామీ కూడా కొండెక్కిందని జిల్లా ప్రజలు ఆరోపిస్తున్నారు. కాకినాడ పోర్టుకు వెళ్లే ప్రధానమైన ఏడీబీ రోడ్డు, సామర్లకోట బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పి వంద రోజులు దాటినా ఒక్క అడుగు ముందుకు పడలేదు. సామర్లకోట–ద్వారపూడి కెనాల్ రోడ్డు ఆధునీకరిస్తామని గొప్పగా ప్రకటించారు. మూతపడిన సామర్లకోట చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తాననే స్థాయిలో ఇచ్చిన హామీని నమ్మామని సామర్లకోట ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. దుంప ఫ్యాక్టరీల నిర్వహణలో విద్యుత్ చార్జీలతో నష్టపోయిన తమకు అండగా ఉంటామని చెప్పితే ఏదో మంచి జరుగుతుందని ఆశించామని ఆ రైతులు చెబుతున్నారు. గద్దెనెక్కాక అసలు ఆ ఊసే లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంద పడకల ఆస్పత్రి మాట ఏమైందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పామాయిల్ రైతులకు నీటి తీరువా మినహాయింపు అన్నారు. అదీ అతీగతీ లేదు.

చంద్రబాబు ఏప్రిల్ 22న జగ్గంపేట ప్రజాగళం సభకు వచ్చి ఎడాపెడా అనేక హామీలు గుప్పించారు. జగ్గంపేట ప్రజాగళం వేదికగా సూపర్ సిక్స్ తీసుకువస్తున్నామని, పవన్ కళ్యాణ్ చెప్పిన మరో రెండు కలిపి టాప్ 10 మానిఫెస్టో తీసుకువస్తామని ఊదరగొట్టారు. కాకినాడ ప్రజాగళంలో కాకినాడ గంజాయి హబ్‌గా తయారయ్యిందని విమర్శలు చేసిన చంద్రబాబు గద్దెనెక్కి 100 రోజులైనా గంజాయిని ఎందుకు నియంత్రించ లేకపోతున్నారని నగర ప్రముఖులు నిలదీస్తున్నారు. కాకినాడ సర్పవరంలోని జయలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంక్ బోర్డు తిప్పేసిందన్న చంద్రబాబు దానికి వైఎస్సార్ సీపీ నాయకులే కారణమని నాడు విమర్శలకు దిగారు. బ్యాంకులో డిపాజిట్లు కోల్పోయిన 26 వేల మందిలో ఒక్కరికైనా చంద్రబాబు, పవన్ కల్యాణ్ డిపాజిట్లు తిరిగి ఇప్పించగలిగారా అని స్థానికులు నిలదీస్తున్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని తాను, పవన్‌కల్యాణ్ డ్రైవర్లుగా పనిచేస్తామని మోసం చేశారని మహిళలు మండిపడుతున్నారు. అధికారంలోకి వస్తే కాపుల సంక్షేమానికి రూ.1500 కోట్లు ఖర్చు చేస్తామన్న చంద్రబాబు మాటల్లో నిజమెంత ఉందో వంద రోజులకే అర్థమైందంటున్నారు. గత జనవరిలో తుని మండలం చామవారం సమీపంలో ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు స్థానిక సమస్యలు ప్రస్తావిస్తూ అధికారంలోకి వచ్చాక అన్నింటినీ పరిష్కరిస్తానన్నారు. మే 5న తుని గొల్ల అప్పారావు సెంటర్‌లో ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న పవన్ కల్యాణ్ తుని మార్కెట్లో వసతుల కల్పన, లోవ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి, తాండవ షుగర్ ఫ్యాక్టరీ సమస్య, తాండవ నదికి కరకట్ట నిర్మాణం తదితర అంశాలపై హామీలు ఇచ్చేశారు. ఇందులో ఒక్కటి కూడా కార్యరూపం దాల్చలేదు.

తునిలో మాదిరిగానే ఇంద్రపాలెం బహిరంగ సభలో పవన్ కల్యాణ్ కాకినాడ రూరల్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తానన్నారు. సూరావుపేట బీచ్‌ను అన్ని హంగులతో అభివృద్ధి చేస్తామని చెప్పి ఎందుకు ఇంతవరకూ కనీసం ప్రతిపాదనలు కూడా చేయలేదని పర్యాటకులు నిలదీస్తున్నారు. కాకినాడను పారిశ్రామిక హబ్‌గా మారుస్తానన్న ఆయన ఒక్కటంటే ఒక్క ఉద్యోగాన్ని అయినా కల్పించి చూపించాలంటున్నారు. పేకాటక్లబ్‌లు లేకుండా చేస్తామన్న పవన్‌కు కాకినాడ రూరల్ శశికాంత్‌నగర్‌లో పేకాట క్లబ్‌లు నిర్వహిస్తున్నా పట్టించుకునే నాథుడు లేడంటున్నారు. ప్రత్తిపాడు సభలో ఏలేరును ఆధునీకరిస్తామని హామీ ఇచ్చిన పవన్ ఒక్క అడుగైనా ముందుకు వేయకపోవడాన్ని ప్రశ్నిస్తున్నారు. వంద రోజుల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా పరిష్కరించారా అని నిలదీస్తున్నారు.



ABN ఆంధ్రజ్యోతి

మిచౌంగ్ ముంచేసినా రైతులను ఆదుకోలేదు

డిసెంబరులో మిచౌంగ్ తుపాన్ వచ్చి రైతాంగం చితి

నేనే డ్రైవర్‌గా ఉంటా...

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి నేనే డ్రైవర్‌గా ఉండి సురక్షితంగా గమ్యం చేరుస్తా. 18 ఏళ్ల పైబడిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తాం. మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం. నిరుద్యోగ భృతి రూ.3,000 ఇస్తాం. ఆక్వా రైతులకు రూ.1.50కే కరెంటు ఇస్తాం. టీడీపీ హయాంలో మొత్తం 11 సార్లు డీఎస్సీ వేశాం. ఐదేళ్లలో ఒక్కసారి కూడా వేయలేని దద్దమ్మ ప్రభుత్వమిది. ఏపీపీఎస్సీలో ఉద్యోగాలు అమ్ముకున్నారు. మేమొచ్చాక ఏపీపీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీ చేపడతాం. ...దరవందరగా మిగిలిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో...



ప్రతి చేతికీ పని.. ప్రతి చేనుకూ నీరు

ఇదే జనసేన, తెదేపా, భాజపా కూటమి లక్ష్యం: పవన్



సామర్లకోట ఫ్లైఓవర్ కూడలిలో కూలిన రెయిలింగ్



సామర్లకోట–కాకినాడ రోడ్డులో మాధవపట్నం వద్ద ట్రాఫిక్

రెయిలింగ్ నిర్మాణం చేపట్టాలి



సామర్లకోట బ్రిడ్జి నిత్యం రద్దీగా ఉంటుంది. భారీ వాహనాల రాక పోకల సమయంలో కూలిపోయిన రెయిలింగ్ వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు ఈ బ్రిడ్జి నిర్మాణానికి ఇచ్చిన హామీని అమలు చేయాలి. అధికారులు వెంటనే రెయిలింగ్ నిర్మించి ప్రమాదాలు నివారించాలి. అంత వరకు గోడ కూలిన ప్రదేశంలో రోడ్డు డివైడర్ బోర్డులు ఏర్పాటు చేయాలి. బ్రిడ్జిని ఆనుకుని ఉన్న గోడలపై చెట్లు పెరిగిపోతుండడంతో బ్రిడ్జి బలహీనపడుతోంది. తక్షణం చర్యలు తీసుకోవాలి.

– కాళ్ల లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్ సామర్లకోట

తలుపులమ్మ లోవ అభివృద్ధిపై మాట తప్పొద్దు



పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిలబెట్టుకోవాలి. అధికారంలోకి వచ్చి వందరోజులైంది. ఇందుకోసం కార్యాచరణ రూపొందించి అన్నమాట ప్రకారం అభివృద్ధి చేయాలి. ఇంత వరకు క్షేత్ర స్థాయిలో ఎటువంటి ప్రతిపాదన రూపొందించకపోవడం మంచిది కాదు.

– దుంగల నాగేశ్వరరావు, వెలమ కొత్తూరు, తుని మండలం

తీరంపై పవన్ దృష్టి సారించాలి



ఎన్నికల సమయంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఉప్పాడ ప్రాంతాన్ని సందర్శించి బీచ్ రోడ్డు అభివృద్ధి చేస్తామని, ఉప్పాడ గ్రామం కోతకు గురికాకుండా రక్షణ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఈ విషయమై ఎటువంటి కార్యాచరణ పవన్ చేయకపోవడం బాధాకరం.

– ఉమ్మిడి జాన్, మాజీ సర్పంచ్, ఉప్పాడ, కొత్తపల్లి మండలం

'స్వర్ణాంధ్ర–2047'కు కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: స్వర్ణాంధ్ర–2047 విజన్‌కు సంబంధించి జిల్లా, మండల కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి ఆయన కాకినాడ నగర కమిషనర్ భావన, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్వర్ణాంధ్ర–2047 విజన్‌కు సంబంధించి జిల్లా కార్యాచరణ ప్రణాళికను అక్టోబరు 15 నాటికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనలో చేర్చాల్సిన ప్రధాన అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ నేపథ్యంలో తొలుత మండల, మున్సిపల్ స్థాయిలో కార్యాచరణ ప్రణాళికను ఈ నెల 30 నాటికి రూపొందించాలన్నారు. ఇందుకు గ్రామ సభలు నిర్వహించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రానున్న ఐదేళ్ల కాలంలో విజన్ ప్లాన్‌కు నివేదిక సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో ప్రతి శాఖ స్వర్ణాంధ్ర–2047 విజన్ లక్ష్యసాధనలో కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పరిశ్రమలు, మానవ వనరులు, వైద్య, విద్యా విధానం, నైపుణ్య అభివృద్ధి వంటి అంశాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్నవరం ఈఓ కొనసాగింపు?



అన్నవరం: అన్నవరం దేవస్థానం ఈఓ, దేవదాయ, ధర్మదాయ శాఖ అడిషనల్ కమిషనర్‌గా రెండు బాధ్యతలు నిర్వహిస్తున్న కె.రామచంద్రమోహన్ మరి కొద్ది రోజులు దేవస్థానం ఈఓగా కొనసాగనున్నట్టు సమాచారం. గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని రెండు ప్రముఖ దేవస్థానాలకు ఈఓలను నియమించిస్తూ జీఓ విడుదల చేసింది. అందులో ద్వారకా తిరుమల ఈఓ వి.త్రినాథరావును సింహాచలం దేవస్థానానికి, తిరుపతి ఆర్‌జేసీగా పనిచేస్తున్న వి.సత్యనారాయణమూర్తిని ద్వారకాతిరుమల దేవస్థానానికి బదిలీ చేశారు. అలాగే దేవదాయ, ధర్మదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో ఆర్‌జేసీగా పని చేస్తున్న ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ ను తిరుపతి ఆర్‌జేసీగా నియమించారు. ఆ జీఓలో అన్నవరం దేవస్థానం ఈఓ నియామకానికి సంబంధించి ఎటువంటి మార్పు లేకపోవడంతో కె.రామచంద్రమోహన్‌ను ఇక్కడే కొనసాగించే అవకాశం ఉందని చెబుతున్నారు. అక్టోబర్ మూడో తేదీ నుంచి దసరా ఉత్సవాలు, నవంబర్ రెండో తేదీ నుంచి కార్తికమాసం ప్రారంభం కానున్నాయి. ఈ రెండు నెలలూ అన్నవరం దేవస్థానానికి ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చేవే. దీనికి తోడు కార్తిక మాసం అయితే నెలంతా దేవస్థానానికి భక్తుల తాకిడితో పాటు సత్యదేవుని తెప్పోత్సవం, గిరి ప్రదక్షిణ వంటి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాల్సి ఉంది. దీనికి అనుభవజ్ఞుడైన అధికారి అవసరం. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఈఓను ఇక్కడ కొనసాగించే అవకాశం ఉంది.

పట్టు వదలని రెవెన్యూ అధికారులు

కాగా, అన్నవరం దేవస్థానం ఈఓ పోస్టు కోసం ఇద్దరు రెవెన్యూ అధికారులు ఇంకా తమ ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నలుగురు స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు ఇక్కడ ఈఓలుగా పనిచేశారు. అదే ఆనవాయితీతో ఇక్కడ ఈఓ లుగా తమను నియమించాలని పలువురు ప్రజాప్రతినిధుల సిఫార్సులతో వీరు ప్రయత్నాలు చేస్తున్నారు. వారి ప్రయత్నాలు ఫలిస్తే మరో రెండు మూడు రోజుల్లో ఈఓగా వారిలో ఒకరికి అవకాశం రావొచ్చు.

ప్రణాళికాబద్ధంగా ధాన్యం సేకరణ

కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: జిల్లాలో 2024–25 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు అనుసరించాల్సిన విధానాలపై వివిధ శాఖల అధికారులు, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో గురువారం కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి ఆయన జిల్లా ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనా, ధాన్యం సేకరణ కేంద్రాలు, సీఎంఆర్ రైస్, కనీస మద్దతు ధర వంటి అంశాలపై ఆయన వారితో చర్చించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 5.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందన్న అంచనాకు గాను, స్థానిక వినియోగం నిమిత్తం 1.04 లక్షల మెట్రిక్ టన్నులు పోను సుమారు 4.14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు రానుందన్నారు. ఇందులో మిల్లర్ల ద్వారా సుమారుగా 1.40 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయగా మిగిలిన 2.74 లక్షల మెట్రిక్ టన్ను ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారా సేకరించాల్సి ఉంటుందని వివరించారు. అవసరమైన సంఖ్యలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 2024–25 ఖరీఫ్ సీజన్‌లో గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2,320 (75 కేజీలకు రూ.1,725)లుగా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయించినట్లు ఆయన వివరించారు. సమావేశంలో డీఆర్వో డి.తిప్పేనాయక్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిశోర్, జె.సీతారామారావు, పౌర సరఫరాల మేనేజర్ ఎం బాలసరస్వతి, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

క్లుప్తంగా

డెంగీతో బాలిక మృతి

శంఖవరం: స్థానికంగా వెన్నెల వనజ (3) డెంగీ జ్వరంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు శంఖవరం ప్రభుత్వాసుపత్రి వైద్యుడు ఆర్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. మూడు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుందని రక్త పరీక్షలు చేయించగా, డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని వివరించారు. జ్వరం ఎక్కువగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించామని కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిందన్నారు.

రైల్వే ఆదాయంలో సామర్లకోటకు 8వ స్థానం

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైల్వే స్టేషన్లలో సామర్లకోటకు ఆదాయంలో 8వ స్థానం సాధించింది. రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధుల మంజూరులో భాగంగా 30 రైల్వే స్టేషన్‌ల్లో ప్రయాణికులు, ఆదాయ వివరాలను రైల్వే కమిటీ సేకరించినట్లు అధికారులు గురువారం తెలిపారు. రాష్ట్రంలో విశాఖపట్నం రైల్వే స్టేషన్ ప్రథమ, శ్రీకాళహస్తి 30, రాజమహేంద్రవరం 4, కాకినాడ 11, తుని 29వ స్థానంలో నిలిచినట్లు వివరించారు. ఇక్కడ 2023-24లో రిజర్వేషన్ టిక్కెట్ల ద్వారా 8,63,004 మంది ప్రయాణించగా, రూ.52,35,87,551 ఆదాయం వచ్చిందన్నారు. అదేవిధంగా 15,95,150 మంది సాధారణ ప్రయాణికుల ప్రయాణంతో రూ.13,81,80,065 ఆదాయం సమకూరిందన్నారు.

పశువుల అక్రమ తరలింపు అడ్డగింపు

కొవ్వూరు: పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీని గురువారం విశ్వ హిందూ పరిషత్ సభ్యులు స్థానిక గామన్ ఇండియా బ్రిడ్జి వద్ద అడ్డుకుని కొవ్వూరు పట్టణ పోలీసులకు అప్పగించారు. కంటైనర్ మాదిరిగా ఉన్న ఈ లారీలో చుట్టూ మూసివేసి పైకప్పు కొంత భాగం ఓపెన్‌గా ఉంచి ఏకంగా 53 పశువులను తరలిస్తున్నారు. మూగజీవాల తరలింపులో ఏవిధమైన నిబంధనలు పాటించలేదు. పాయకరావుపేట నుంచి హనుమాన్ జంక్షన్‌కు ఈ పశువులను తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేస్తామని ఆయన వివరించారు.

గొంతు తడారి.. ఇదో ఎడారి

- కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో దుస్థితి
- పాడైన వాటర్ ప్లాంట్
- నీటి కోసం క్రీడాకారుల పాట్లు
- జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల సందర్భంలోనూ అంతే


డీఎస్‌ఏలో మూలకు చేరిన మినరల్ వాటర్ ప్లాంట్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆటలాడి... అలసి సొలసిన క్రీడాకారులకు గుక్కెడు నీరు దొరకడం గగనమైంది. గొంతు తడారి దిక్కులు చూస్తున్నా అక్కడ ఎడారినే తలపిస్తోంది.. కనీస సౌకర్యాలు లేక, ఎవరూ పట్టించుకోక ఏళ్లకాలంగా ఇబ్బంది తరుముతూనే ఉంది. ఇదేదో మారుమూల ప్రాంతంలో అనుకుంటే పొరబడినట్టే. జిల్లా కేంద్రం, అందులోనూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాకు అతి కీలకమైన కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో దుస్థితి. జలం.. మనిషి ఎంతో అవసరం. రోజూ కనీసం 3 నుంచి 5 లీటర్ల నీరు తాగాలనేది వైద్య నిపుణుల మాట. సాధారణ వ్యక్తుల కంటే క్రీడాకారుల జీవన శైలి కాస్త భిన్నం. అందుకే వారు నీరు ఎక్కువగా తీసుకోవాలని చెబుతుంటారు. అయితే కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో నీటి కోసం పాట్లు పడాల్సి వస్తోంది. ఇక్కడకు రోజూ వందలాది సంఖ్యలో క్రీడాకారులు వచ్చి వివిధ క్రీడాంశాల్లో శిక్షణ పొందుతుంటారు. వీరితో పాటు పోలీస్, ఇన్‌కం ట్యాక్స్, ఆర్మీ, నేవీ తదితర ఉద్యోగాల కోసం శారీరక పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు, వాకర్స్ కూడా వస్తుంటారు. జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా ఎంపికలు, పోటీలు నిర్వహించే రోజుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ క్రీడాకారులు డీఎస్‌ఏలోనే ఉంటారు. మారిన వాతావరణ పరిస్థితుల్లో చలికాలంలోనూ ఎండలు అధికమయ్యాయి. తాగునీటి అవసరాలూ పెరిగాయి. అయితే డీఎస్‌ఏకు వివిధ అంశాలపై వస్తున్న వారు గుక్కెడు నీటి కోసం బయటకు పరుగులు తీయాల్సి వస్తోంది. తాగుదామంటే గుక్కెడు నీరు దొరకక ఇబ్బంది వెంటాడుతోంది. ఏళ్ల కిందట డీఎస్‌ఏలోని మినరల్ వాటర్ ప్లాంట్ పాడైంది. తాగునీరు సౌకర్యం ఉందని చెప్పుకోవడానికి ఒక చేతి పంపును ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. వెయ్యి మంది క్రీడాకారులకు ఈ ఒక్క పంపు ఏవిధంగా సరిపోతుందని క్రీడా సంఘాల ప్రతినిధులు పెదవి విరుస్తున్నారు. అవుట్‌డోర్ ఫీల్డ్‌లో హాకీ, వాలీబాల్, బాస్కెట్ బాల్, అథ్లెటిక్స్, కబడ్డీ, క్రికెట్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు, ఇండోర్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్, టీటీ, రెజ్లింగ్, స్విమ్మింగ్, స్క్వాష్‌లో శిక్షణ పొందుతున్న వారు, రోజూ ఫిట్‌నెస్ వ్యాయామాలు చేసిన తరువాత తప్పకుండా నీటిని తాగాలి. కానీ వారు తెచ్చుకున్న బాటిల్‌లో నీరు అయిపోతే ఇంటికి వెళ్లే వరకూ గొంతు ఎండాల్సిందే.

ఆదాయం వస్తున్నా..

ఆదాయ పరంగా నెలకు ఒక్క డీఎస్‌ఏ షాపింగ్ కాంప్లెక్స్ నుంచే రూ.3 లక్షలు, ప్లే అండ్ ప్లే విధానంలో మరో రూ.2 లక్షలు ప్రతి నెలా వస్తున్నాయి. అయినా తాగునీటి ప్లాంట్‌ను బాగు చేయడానికి చర్యలు తీసుకోకపోవడంపై క్రీడాకారుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ఇబ్బంది ఉన్నా భరించాల్సిందే..



నేను మూడేళ్లుగా డీఎస్‌ఏలో అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతున్నా. తాగునీటి సౌకర్యం లేక ఇంటికి వెళ్లి నీరు తాగాల్సి వస్తుంది. అప్పటి వరకూ ఎంత దాహం ఉన్నా భరించాల్సిందే. చాలా ఇబ్బంది పడుతున్నాం.

– ఉదయ్‌కుమార్, అథ్లెటిక్స్ క్రీడాకారుడు

ఇంటి నుంచే తెచ్చుకుంటూ..



నేను మూడేళ్లుగా జిల్లా క్రీడా మైదానంలో జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ పొందుతున్నాను. ఇంటి నుంచి తెచ్చుకున్న బాటిల్‌లో నీరు అయిపోతే ఇంతే సంగతులు. మళ్లీ నీరు పట్టుకుందామంటే నీటి సౌకర్యం లేదు. ఇలాగైతే శిక్షణ ఎలా పొందగలం.

– శషాంక్, జిమ్నాస్టిక్ క్రీడాకారుడు

శాశ్వత పరిష్కారం చూపాలి



కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో వివిధ క్రీడా అసోసియేషన్లు, ఎస్‌జీఎఫ్‌ఐ, శాప్, ఖేలో ఇండియా జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాకారుల ఎంపికలు, పోటీలు జరిగినప్పుడు తాగునీరు సౌకర్యం కల్పించాలి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

–వి.రవిరాజు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు


ఈ పాత చేతిపంపు ఒక్కటే ఆధారం

పంచాయతీరాజ్ వ్యవస్థపై అవగాహన పెంచాలి


శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: పంచాయతీ రాజ్ వ్యవస్థపై స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు పూర్తి స్థాయిలో అవగాహన పెంచాలని విస్తరణ శిక్షణా కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాల్లోని అధికారులకు మూడు రోజుల పాటు పంచాయతీరాజ్ విధులపై నిర్వహించిన ముగింపు శిక్షణలో గురువారం ఆయన పాల్గొన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు పంచాయతీరాజ్ వ్యవస్థపై అవగాహన పెరిగితే ఆయా మండలాలకు జిల్లా పరిషత్తు నుంచి ఎక్కువ నిధులు తీసుకువచ్చే విధంగా ప్రయత్నాలు చేస్తారని తెలిపారు. గ్రామాలు ఆరోగ్యవంతంగా ఉండే విధంగా చేయాలని ఆయన సూచించారు. అప్పుడే ప్రగతి సాధ్య పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసే పరిశ్రమల్లో స్థానిక యువతకు తప్పని సరిగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే విషయాన్ని తెలియజేయడం ద్వారా ఆయా ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్య కొంత మేరకు పరిష్కారం అవుతుందని చెప్పారు. మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణలో నేర్చుకున్న అంశాలపై మండల స్థాయి అధికారుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. రాత పరీక్ష నిర్వహించి, శిక్షణకు హాజరైన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ముగింపు శిక్షణలో ఫ్యాకల్టీలు జీఎస్‌ఆర్ శ్రీదేవి, పి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తూ పట్టుబడిన బాలికలు

గోకవరం: గంజాయి అక్రమ రవాణాలో అమాయక బాలికలు బలైపోతున్నారు. గోకవరంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు బాలికలను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ కథనం ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు గోకవరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఇద్దరు బాలికలను పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి రెండు బ్యాగుల్లో సుమారు రూ.1.53 లక్షల విలువైన 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరికి చెందిన వారు. అక్కడి జోగ్బే వద్ద కొనుగోలు చేసి హర్యానాకు చెందిన రేణుకకు సరఫరా చేస్తున్నారని గుర్తించామని ఎస్పీ అన్నారు. పట్టుబడిన ఇద్దరూ చదువుకుంటున్నారని, వీరిని రాజమహేంద్రవరంలోని జువైనల్ హోమ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో ఛేదించిన నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు, కోరుకొండ సీఐ సత్యకిశోర్, గోకవరం ఎస్సై పవన్‌కుమార్, ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

స్వామి కోసం వేలం


వేలంలో రూ.1.65 లక్షలు పలికిన వినాయక విగ్రహం

దేవరపల్లి: సాధారణంగా వినాయక చవితి ఉత్సవాల్లో స్వామివారి వద్ద ఉంచిన లడ్డూ ప్రసాదానికి వేలం వేయడం చూస్తుంటాం.. అయితే ఇక్కడ ఓ ఆచారం ఏళ్ల కాలంగా నడుస్తోంది.. అదేంటంటే.. నవరాత్ర ఉత్సవాల్లో నిలిపిన ఉత్సవ విగ్రహానికి వేలం వేయడం, దానిని దక్కించుకున్న పాటదారుడి సారథ్యంలో నిమజ్జన ఊరేగింపు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇది దేవరపల్లిలోని మెరకవీధి వినాయకుడి ఆలయం వద్ద జరుగుతోంది. దీనికి సంబంధించి బుధవారం రాత్రి అక్కడి మండపంలో వినాయక విగ్రహానికి వేలం పాట నిర్వహించారు. ఆ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంపై ఊరేగించి, జలపాతంలో నిమజ్జనం చేయడానికి ఈ పాట జరిగింది. రాత్రి 8 గంటలకు ప్రారంభమైన వేలం పాట అర్ధరాత్రి వరకూ సాగింది. చివరకు గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు, న్యాయవాది కౌరం అప్పారావు నాయుడు, జీడిపప్పు వ్యాపారి అనిశెట్టి అబ్బు మధ్య గట్టి పోటీ నడిచింది. ఈ పోటీలో అబ్బు రూ.1.63 లక్షలకు పాడగా, కైరం అప్పారావు నాయుడు రూ. 1.65 లక్షలకు విగ్రహాన్ని సొంతం చేసుకున్నారు. ఈ విగ్రహాన్ని శనివారం గ్రామ పుర వీధుల్లో ఊరేగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే స్వామివారికి భక్తులు సమర్పించిన 108 కిలోల లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించగా, పంచాయతీ సభ్యుడు పచ్చా రాంగోపాల్, దుగ్గిన లీలాకృష్ణ గంగాధర్ నాయుడు రూ.63 వేలకు సొంతం చేసుకున్నారు.

ఆంధ్రావాసి అమెరికాలో మృతి

తల్లడిల్లుతున్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు


మృతుడు రమేష్ (ఫైల్)

నల్లజర్ల: ప్రకాశరావుపాలేనికి చెందిన ముత్తిన రమేష్ (40) అమెరికాలో మృతి చెందినట్టు గురువారం కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని సోదరుడు నరేష్ అందించిన వివరాల ప్రకారం.. అమెరికాలోని ఇల్‌నాయిస్ రాష్ట్రంలోని కార్‌బొనలే సిటీలోని సదరన్ ఇల్‌నాయిస్ యూనివర్సిటీలో మృతుడు రమేష్ ఎంఎస్ చదవడానికి 2022లో వెళ్లాడు. ప్రయివేటుగా ఉద్యోగం చేస్తూనే చదువుకుంటున్నాడు. అక్కడి సిటిజన్‌తోనే రెండేళ్ల క్రితం వివాహమైంది. ఆమెతో విభేదించి రమేష్ వేరుగా ఉంటున్నాడు. ఆదివారం రాత్రి బయటకు వెళ్లి భోజనం చేసి వచ్చి రూంలో పడుకున్నాడని అతని స్నేహితులు చెప్పినట్టు నరేష్ తెలిపారు. సోమవారం, మంగళవారం రమేష్ ఆచూకీ లేకపోవడం, అతని రూం నుంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా రమేష్ మృతి చెంది ఉన్నాడని, మృతదేహం పాడై ఉందని వివరించారు. అక్కడి పోలీసులే బుధవారం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గుండెపోటు లేదా బ్రెయిన్ హెమరేజ్ వచ్చి మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతదేహాన్ని మనదేశానికి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని మృతుని మేనమామ వైఎస్సార్ సీపీ నాయకుడు కరుటూరి లక్ష్మీగణేశ్వరరావు తెలిపారు. మృతునికి తండ్రి లేరు. తల్లి పండమ్మ, సోదరులు నాని, నరేష్ ఇక్కడ ఉంటున్నారు.

బాల సుబ్రహ్మణ్యమే నాకు ఆదర్శం

వర్ధమాన గాయకుడు హనుమాన్



అమలాపురం టౌన్: ప్రముఖ సినీ గాయకుడు దివంగత ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం తనకు ఆదర్శమని వర్ధమాన సినీ గాయకుడు త్సవటపల్లి హనుమాన్ అన్నారు. అమలాపురం రూరల్ మండలం సమనస గ్రామానికి చెందిన హనుమాన్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూనే పలు సినిమాల్లో పాటలు పాడి వర్ధమాన గాయకుడిగా నిలదొక్కుకుంటున్నారు. సొంతూరుకు వచ్చిన ఆయన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని విలేకర్లతో మాట్లాడారు. చిన్నతనంలోనే తన తండ్రి సహకారంతో చెన్నైకి వెళ్లి ఎస్పీ బాల సుబ్రహ్మణ్యాన్ని కలిశానని చెప్పారు. టీవీ షో స్వరాభిషేకం తదితర పాటల కార్యక్రమంలో బాల సుబ్రహ్మణ్యం సమక్షంలో ఎన్నో పాటలు పాడి ఈ స్థాయికి వచ్చానని వివరించారు. తాను ఇప్పటి వరకూ 30 సినిమాల్లో పాటలు పాడానని చెప్పారు. వెంకీమామ చిత్రంలో 'కోకోకోలా పెప్సీ' పాటకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. డార్లింగ్ సినిమాలో ఓ పాట మంచి ట్రెండ్‌లోకి వచ్చిందని చెప్పారు. స్కంద చిత్రంలో కూడా పాటలు పాడానని తెలిపారు. తాను సినీ సంగీత దర్శకులు తమన్, మణిశర్మ, కోటి వద్ద పనిచేసి పాటలు పాడానన్నారు. దాదాపు రెండు వేల వరకూ స్టేజ్ షోలు చేశానని చెప్పారు. ఇవి కాకుండా హిందీ, మలయాళం, తమిళ భాషల్లో కూడా పలు పాటలు పాడానని తెలిపారు. హిందీ చిత్రం 'లియో'లో 'బ్యాడస్' అనే పాట పాడానన్నాను. తెలుగు చిత్రం 'కీడా కోలా' చిత్రంలో 'దిపిరి దిపిరి' సాంగ్ మంచి పాపులర్ అయ్యిందని చెప్పారు. కార్యక్రమంలో ఐఎంఏ కోనసీమ శాఖ మాజీ అధ్యక్షుడు డాక్టర్ గొలకోటి రంగారావు, బీఎస్‌ఎన్‌ఎల్ విశ్రాంత డీఈఈ వెంకటేశ్వరరావు, గాయకుడు హనుమాన్ తండ్రి త్సవటపల్లి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమలాపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గాయకుడు హనుమాన్‌కు ఘన సత్కారం జరిగింది. స్థానిక కిమ్స్ వైద్య కళాశాలలో 'బ్యాండ్' పేరుతో గురువారం రాత్రి జరిగిన సంగీతా విభావరిలో కూడా గాయకుడు హనుమాన్ పలు పాటలు పాడి అలరించారు.

అది పులి కాదు.. అడవి పిల్లి

- తోటల్లోకి చిరుత దూకిందనే వార్తల్లో నిజం లేదు
- నిర్ధారించిన అటవీశాఖ అధికారులు


శ్రీరామపురంలోని సీసీ కెమెరాకు చిక్కిన అడవి పిల్లి చిత్రం

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువు శివారు శ్రీరామపురం, రాకీ ఎవెన్యూ అపార్ట్‌మెంట్ సమీపంలోని తోటల్లోకి బుధవారం రాత్రి చిరుతపులి దూకిందనే ప్రచారంలో నిజం లేదని జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.భరణి తెలిపారు. ఆ ప్రాంతంలో ఒక జంతువు సంచరించిన మాట వాస్తవమేగానీ అది చిరుత పులి కాదని, అడవి పిల్లి అని నిర్ధారించారు. ఆ ప్రాంతంలో అమర్చిన ట్రాప్ కెమెరాలో అడవి పిల్లిని గుర్తించామని, పాదముద్రలు కూడా దానివేనన్నారు. గత రాత్రి కోలమూరులో కూడా చిరుతపులి సంచరించినట్టు వచ్చిన ప్రచారం సరికాదన్నారు. అక్కడ కూడా అడవి పిల్లి పాదముద్రలే కనిపించాయన్నారు. ఈ రెండు ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్టు వచ్చిన ప్రచారాలతో వెంటనే తమ నిపుణుల బృందాలను పంపించి, పరిశీలించామన్నారు. అక్కడ గుర్తించిన పాదముద్రల ప్రకారం అడవి పిల్లిగా నిర్ధారణకు వచ్చామన్నారు. ప్రస్తుతం నివాస ప్రాంతాల వద్ద చిరుతపులి సంచరిస్తున్నట్టు ఎటువంటి ఆధారాలు లేవన్నారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన పనిలేదని అన్నారు.


అడవి పిల్లి పాదముద్రలు

మరిన్ని ట్రాప్ కెమెరాల ఏర్పాటు

లాలాచెరువు, దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్న నేపథ్యంలో దానిని గుర్తించి, పట్టుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని భరణి చెప్పారు. మొన్నటి వరకూ వివిధ ప్రాంతాల్లో 50 ట్రాప్ కెమెరాలను అమర్చగా, అది సంచరిస్తున్న ఏరియాలకు అనుగుణంగా వీటిని కూడా స్థాన మార్పులు చేస్తూ వాటి వందకు పెంచామన్నారు. అలాగే ఏడు బోనులను ఏర్పాటు చేసి, చిరుతపులిని సురక్షితంగా బంధించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కొంతమంది వ్యక్తులు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి, భయపడవద్దని, ఆ విధంగా అసత్య ప్రచారాలు చేసే వారిపై పోలీసులు చర్యలు తీసుకుంటారని భరణి హెచ్చరించారు. చిరుత పులిని పట్టుకునేందుకు శాఖాపరంగా చేస్తున్న ప్రయత్నాలకు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు.

ముగ్గురిపై హత్యాయత్నం కేసు


రిసార్ట్స్ వద్ద విచారణ చేస్తున్న డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్

అల్లవరం: ఓడలరేవు తీరంలోని సముద్ర రిసార్ట్స్‌లో బుధవారం రాత్రి వంట కుక్ మట్టా దుర్గాప్రసాద్‌పై ముగ్గురు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనపై డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ విచారణ చేపట్టారు. గురువారం ఉదయం రిసార్ట్స్‌లో ఘటన జరిగిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మట్లాడుతూ కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన సుంకర సురేష్, తోరం రమేష్, తిక్కిరెడ్డి బన్ని రిసార్ట్స్‌లో అద్దెకు రూమ్ తీసుకున్నారని అన్నారు. వారు తీసుకున్న రూమ్ గడువు ముగియడంతో రిసార్ట్స్ నిర్వాహకుడు విలియమ్స్ రూమ్ ఖాళీ చేయమని కోరగా, పైముగ్గురూ విలియమ్స్‌తో ఘర్షణకు దిగారు. దీంతో అక్కడే పనిచేస్తున్న దుర్గాప్రసాద్ వారిని వారించడంతో అందుబాటులో ఉన్న మద్యం సీసాతో దుర్గాప్రసాద్ తలపై కొట్టారు. దీంతో అతనికి తీవ్ర రక్తస్రావం కావడంతో నిర్వాహకులు అమలాపురం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనలో రమేష్, బన్ని, సురేష్‌లపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. డీఎస్పీ వెంట ఎస్సై హరీష్‌కుమార్ ఉన్నారు.

ఎస్‌జీఎఫ్ అండర్- 19 క్రీడాకారుల ఎంపిక

రామచంద్రపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్- 19 పాఠశాల క్రీడా సమాఖ్య ఎంపిక పోటీలు రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. బాస్కెట్‌బాల్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, షటిల్, కరాటే, టేబుల్ టెన్నిస్ క్రీడాంశాల్లో ఎంపికలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల నుంచి వచ్చిన రెండు వందల మంది క్రీడాకారుల్లో ఆరు జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు అండర్- 19 ఎస్‌జీఎఫ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున రాష్ట్ర పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని పీడీ జంపన రఘురాం తెలిపారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.వీరన్న అధ్యక్షతన జరిగిన పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, ఎస్‌జీఎఫ్ అండర్- 19 ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరామకృష్ణ, పీడీలు కె.సతీష్, ఈవీవీ సత్యనారాయణ, రతన్ శామ్యూల్, విశ్రాంత పీడీ ఓలేటి సీతాపతిరావు, గ్రంథాలయాధికారి చక్రధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గండేపల్లి: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందినట్లు గండేపల్లి ఎస్సై యూవీ శివనాగబాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రంగంపేటకు చెందిన రావూరి ఏసు (50), అతని భార్య రవణమ్మతో కలసి మండలంలోని ఉప్పలపాడులో ఓ పొలం వద్ద కాపాలాగా ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వచ్చిన ఏసు భార్య కూర వండలేదని గొడవపడి క్రిమిసంహారక మందు తాగాడు. అతనిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా బుధవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

అల్లవరంలో..

అల్లవరం: అల్లవరం బసవా మంగాయమ్మ కళ్యాణ మండపం వద్ద ఈ నెల 17న ఓ మోటార్ సైకిల్ ఢీకొని తీవ్ర గాయాలపాలైన చిర్రా నాగేశ్వరరావు (60) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయాన్ని అల్లవరం ఎస్సై హరీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

మరో ఘటనలో మహిళ..

అయినవిల్లి: మండలంలోని క్రాప శంకరాయగూడేనికి చెందిన ఓ మహిళ అమలాపురంలోని ఓ ప్రైవేట్ అస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఎస్సై కె.మనోహరజోషి తెలిపిన వివరాలు ఇలా.. అయినవిల్లి మండలం క్రాప గ్రామానికి చెందిన నక్కా రామలక్ష్మి (63) మానసిక స్థితి సరిగా లేకపోవడంతో చనిపోదామని ఈ నెల 17న గడ్డి మందు తాగింది. రామలక్ష్మిని గమనించిన ఆమె బంధువులు చికిత్స నిమిత్తం అమలాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రత్నగిరి ఉద్యోగులకు నోటీసులు

అన్నవరం: రత్నగిరి దేవస్థానం ఏఈఓ కె.కొండలరావు, సూపరింటెండెంట్ ఐవీ రామారావులు పేకాట ఆడుతూ పోలీసు దాడిలో పట్టుబడ్డారు. తుని రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు ఉన్నందున, వారిద్దరిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో సంజాయిషీ ఇవ్వాలని ఈఓ కె.రామచంద్రమోహన్ గురువారం మెమో జారీ చేశారు. పేకాట ఆడుతూ వారు పట్టుబడినట్లు వచ్చిన వార్తలతో దేవస్థానానికి చెడ్డ పేరు వచ్చిందని ఆ మెమోలో పేర్కొన్నారు. వారం రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని పేర్కొన్నారు.

డ్రగ్స్ తయారీ కేసులో మరొకరి అరెస్ట్

నల్లజర్ల: ఘంటావారిగూడెంలో మత్తు మందు అల్ప్రాజోలం తయారీ కేసులో మరొకరిని అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. కొయ్యలగూడేనికి చెందిన పవులూరి శ్రీనివాస్‌ను అతని స్వగ్రామంలోనే అరెస్ట్ చేశామన్నారు. ఈ కేసులో ఇప్పటికే నలుగురిని అరెస్ట్ చేశారు. వారిలో స్థల యజమాని తాతిన బాలకృష్ణ, పుల్లలపాడుకు చెందిన పాతూరి సతీష్, హైదరాబాద్‌కు చెందిన డ్రగ్స్ తయారీ నిపుణులు సాంబన జగదీష్, మాకం వెంకటేష్ ఉన్నారు.